

# డాక్టర్ చెప్పిన కథలు

## – డా.శైలజ చందు



## - తొమ్మిదవ కథ -

**పిజి చేసే** రోజుల్లో, మా ట్రెయినింగ్ లో భాగంగా, తమిళనాడులోని ఒక మిషనరీ హాస్పిటల్ లో కొన్ని నెలలు పనిచేయాలనేది ఒక రూల్ ఉండేది. ఆ హాస్పిటల్ లో విపరీతమైన రద్దీ ఉంటుందనీ, మాకు అనుభవం, అదీ బాగా వస్తుందని మా ప్రొఫెసర్ ఆ ఏర్పాటు చేశారు. అక్కడ ఉన్నన్ని రోజులు హాస్పిటల్ ఆవరణలో ఉన్న హాస్టల్ లో ఉండేదాన్ని.

ఆ హాస్పిటల్ లో శారద గారని మాకు గైనిక్ హెడ్ గా ఉండేవారు. వయసుతో సంబంధం లేకుండా, ఆవిడకూ, నాకూ ఎందుకో చాలా త్వరగా స్నేహం కలిసింది.

ఆవిడకు చదువు, వృత్తి తప్ప వేరే లోకమే తెలియదు. వృత్తిలో కొత్త విషయాలు తెలుసుకోవడం, ఎప్పటి కప్పుడు జర్నల్స్ చదువుకోవడం , అవి మళ్ళీ జూనియర్స్ కు పాఠాలు చెప్పడం ---అదే ప్రపంచం ఆవిడకు. అర్థ రాత్రి ఎప్పుడైనా సరే, జూనియర్ డాక్టర్ కు ఒక్క ఫోన్ కాల్ దూరంలో అందుబాటులో ఉండేవారు. ఆపరేషన్ మధ్యలో ఏదైనా సమస్య వస్తే అయిదునిముషాల్లో వచ్చి అది పరిష్కరించేవారావిడ. స్టూడెంట్స్ కూ, కొలీగ్స్ కూ ఆవిడంటే చాలా అభిమానం.

ఆవిడ భర్త కూడా డాక్టరే. ఆయన కూడా అదే హాస్పిటల్ లో ఎనస్థీషియా విభాగంలో పనిచేసేవారు. ఆవిడ సర్జరీ చేస్తుంటే ఆయన ఎనస్తీషియా ఇచ్చేవాళ్ళు. ఇంటిదగ్గర ఒకటి సారి రెండు సార్లు కనిపించారు కానీ, 'హలో , నమస్తే' కన్నా ఆ పరిచయం ముందుకు సాగలేదు . ఇద్దరు మగపిల్లలూ బాగా తెలివికలవాళ్ళనీ, ఐ ఐ టీ లో మంచి రాంకులు సంపాదించి ఇంజినీరింగ్ చదువుతున్నారనీ డిపార్ట్ మెంట్లో ఎవరో చెప్పారు.

ఆ హాస్పిటల్ కు సంబంధించిన మెడికల్ కాలేజీలో ఆవిడ పాఠాలు చెప్పేవాళ్ళు. ఒక్కోసారి నాకు కాల్ డ్యూటీ లేనపుడు, ఆవిడ తనతో బాటే, మెడికల్ కాలేజీకి తీసుకెళ్ళేవారు. ఆ తర్వాత , వాళ్ళింటికి తీసుకెళ్ళి టీ తాగించి సాయంత్రానికి మళ్ళీ హాస్టల్ లో దించేవారు. శారదగారికి వృత్తి అంటే ఎంత ప్రాణమో, ఇంటిపనులన్నా, వంటపనులన్నా అంత బద్ధకం. ఆవిడకు కనీసం కాఫీ కలుపుకోవడం వచ్చా అని అనుమానం వచ్చేది. ప్రొఫెషన్ లో ఇరవైనాలుగ్గంటలూ పనిచెయ్యమన్నా సరే అలుపూ సొలుపూ లేకుండా పని చేస్తారు కానీ, ఇంట్లో వంట చెయ్యాల్సి వస్తే, పస్తే ఉంటానంటారు. ఇద్దరు పిల్లల్ని ఎలా పెంచారో అర్థం అయ్యేది కాదు.

ప్రతి సాయంత్రం ఒక గుడికి తీసుకెళ్ళేవారు. ఒకే రాతితో కట్టారు కదా అనిపించే రాతి గోడలతో, ఆకుపచ్చని కోనేరుతో, గుడి ఎంత బాగుందీ అనుకునేదాన్ని. గుడి హడావుడికి కొద్ది దూరంలో చల్లని రాతి మండపం లో కూర్చోబెట్టి , కబుర్లు చెప్పేవారావిడ. వృత్తిలో అనుభవాలే మాట్లాడేవారు.. తన గురించి ఒక్క మాటా ఉండేది కాదు. మిగతా ఆడవాళ్ళలాగా భర్త గురించి, పిల్లల గురించి ఆవిడ మాట్లాడగా నేను వినలేదు. ఆవిడ ఏం చెప్తున్నా సరే ఎంత నిజాయితీ, ఎంత నిక్కచ్చి మనిషీవిడ అనిపించేది. మోసం, అబద్ధం, తెలిసి

తప్పు చేయడం లాంటివి సహించలేరు. ఆమెతో స్నేహం నాకు ఎప్పటికప్పుడు భయం కలిగించేది. ఏదైనా పొరపాటు చేస్తానేమో, ఎప్పుడైనా కోపం తెప్పిస్తానేమో , ఈ స్నేహం తెగిపోతే ఎంత బాధపడాలో అని..

రుక్మిణి అనే పనిమనిషి ఇంటిపనులు, వంట పనులు చూస్తుందని నాతో ఒక సారి అన్నారు. వంట పనులేమో గానీ , ఇంటిపనులు చూసేందుకు ఎవరూ లేరని ఆవిడ ఇంటికెళ్తే తెలిసింది. అదొక సముద్రం లానే ఉండేది. పుస్తకాలు, జర్నల్స్, ఉత్తరాలూ అన్నీ సోఫాల్లోనూ, కుర్చీల్లోనూ, ఉండేవి. కూర్చోవాలంటే , వాటన్నిటినీ తీసి సర్దాలన్నాకూడా కుదిరేది కాదు. ఇల్లంతా నిండుగా ఉండేది.

ఇంటికన్నా గుడి పదిలం అని ఎందుకన్నారో ఆవిడ ఇంటిని చూస్తే తెలిసేది.

ఓ రోజు కాన్ఫరెన్స్ విషయాలు చర్చించేందుకు అందరూ వస్తున్నారని నన్నూ తీసుకెళ్ళారు. తోటి డాక్టర్లంతా, రెండు కార్లలో మేడం ఇంటికి బయలు దేరారు .ఇల్లు విశాలమైనదే కానీ, కూర్చోడానికి ఎక్కడా జాగా ఉండదు. వీళ్ళందరూ ఎక్కడ కూర్చుంటారని నేను భయపడుతున్నాను కానీ, శారద గారు మాత్రం నవ్వుతూ తుళ్ళుతూ మాట్లాడుతున్నారు. ఇంటికెళ్ళేసరికి , ఎక్కడి వస్తువులక్కడ సర్ది ఉన్నాయి. ఎప్పుడూ లేనంత విశాలంగా కనిపిస్తోంది.

అందరూ సోఫాల్లో కూర్చున్నారు. అవీ చాలక డైనింగ్ టేబిల్ చుట్టూ ఉన్న కుర్చీలన్నీ తీసుకెళ్ళి సోఫాల మధ్యలో వేసుకున్నారు. అక్కడున్న టీపాయ్ మీద కాగితాలు పెట్టి వివరాలు మాట్లాడుకుంటున్నారు. ఇల్లేమిటి ఇంత శుభ్రంగా ఉందని , నేను కాసేపు ఆశ్చర్యపోయి, హాల్లోనే ఓ పక్కగా వేసి ఉన్న దీవాన్ మీద, విడిగా కూర్చుని అటూ ఇటూ చూస్తున్నాను. ఎటూ ఆ కాన్ఫరెన్స్ టైముకు నేను అక్కణ్ణుంచి వెళ్ళిపోతాను.

రుక్మిణి ఎక్కడుందో తెలియదు. ఓ అమ్మాయి హాల్లో తడిగుడ్డతో శుభ్రంగా తుడుస్తోంది. అక్కడ అంత మంది మనుషులు గోలగోలగా మాట్లాడుకుంటున్నారన్న ధ్యాస లేనట్టు, మౌనంగా హాలంతా తుడుస్తోంది.

ఇంతలో మేమొచ్చిన అలికిడి విని రుక్మిణి బయటకొచ్చి, పనిచేస్తున్న ఆ అమ్మాయితో చెవిటి వాళ్లతో మాట్లాడినట్లు " లోపలకెళ్ళి అంట్లు తోము ఫో ." అంది.

ఆ తడిగుడ్డ , నీళ్ళబకెట్ నీ అలాగే హాల్లో వదిలేసి లోపలికెళ్ళింది.

బకెట్ అదీ తీసుకుని రుక్మిణి లోపలికెళ్ళింది.

పావుగంట తర్వాత, ఆ అమ్మాయి, రుక్మిణి వచ్చి అందరికీ టిఫిన్ ప్లేట్లు అందించింది. . కాసేపటికి ఆ అమ్మాయి చేతిలో కాఫీ కప్పులున్న ట్రే పట్టుకుని వచ్చి నుంచుంది. ట్రే పట్టుకుని అందరి ముందూ నుంచున్న ఆ అమ్మాయి పైట చెదిరిపోయింది. అయినా పట్టించుకోకుండా అలానే నుంచుంది. గభాల్న రుక్మిణి వచ్చి పైట సరి చేసి "లోపలికి ఫో " అని గదిమినట్టు నెమ్మదిగా అంది.

నేను టిఫిన్ తినేసి ప్లేట్ వంటింట్లో పెట్టడానికి తీసుకెళ్ళాను. ఆ అమ్మాయి సింక్ ముందు నిలబడి అంట్లు తోముతూ ఉంది. నేనొచ్చిన విషయం కూడా పట్టించుకోలేదు. విచిత్రంగా, ఆమె మొహంలో ఏ రకమైన భావమూ లేదు. ఆ అమ్మాయి పనిచేసే పద్ధతి చూస్తే.. చేస్తున్న పనిమీద అవసరమైన దానికన్నా కూడా ఎక్కువ శ్రద్ధ చూపిస్తుందేమిటీ అనిపించింది.

కాసేపటికి అందరూ వెళ్ళిపోతుంటే, వాళ్ళలో ఎవరో ఒకరికి, నన్ను నా హాస్టల్ దగ్గర దింపమని చెప్తారేమో అనుకుని బాగ్ తీసుకుని రెడీ అయ్యానుకానీ వాళ్ళందర్నీ పంపించి వెనక్కొచ్చి నాతో పాటు దీవాన్ మీద కూర్చున్నారు.

హాల్లో ఖాళీ ప్లేట్లు, కప్పులు తీసుకెళ్ళడానికొచ్చింది ఆ అమ్మాయి. మా వంక ఒక్క చూపుకూడా లేదు. ఒక రోబో లాగా పనిచేస్తోంది.

"ఈ అమ్మాయెవరు మేడం, ఎప్పుడూ చూడలేదు?" అడిగాను

"అది మన రుక్మిణి కూతురు, రోజా. నర్సింగ్ కాలేజ్ హాస్టల్ లో ఉంటుంది. రుక్మిణి ఇదివరకు రెండు మూడిళ్లలో చేసేది. ఇంటిదగ్గర వదిలేసి రావడానికి భయమేసి దీన్ని అక్కడ కాలేజీ హాస్టల్ లో చేర్చింది. నర్సింగ్ కాలేజ్ చూసుకునేది మన చూడామణి గారే , రోజాకు నర్సింగ్ హాస్టల్ లో ఆయాగా ఉద్యోగం వేయించారు. అక్కడైతే దానికి సేఫ్టీ ఒక్కటే కాదు. జీతమూ వస్తుంది. అందరిలా ఐక్యు తక్కువ కానీ, ఏ పనైనా చక్కగా చేస్తుంది."

"అదే చూస్తున్నా. ఇల్లంతా మెరిసిపోతోంది."

"అదెన్నాళ్ళు, ఇంకా వారం రోజులే. అక్కడ కాలేజీ తెరవగానే అది వెళ్ళిపోతుంది. ఇహ ఆ తర్వాత రుక్మిణీ, నేనూ, ఇంట్లో వస్తువులన్నీ ఎడా పెడా పడేసుకోవచ్చు. ."

ఆ హాస్పిటల్ లో నా ట్రెయినింగ్ ఇంకా వారం రోజుల్లో అయిపోతుందనగా, క్రిస్ మస్ సెలవలకని వచ్చింది రోజా.

ఆ రోజు , ఇంటికెళ్దామని శారదగారు తీసుకెళ్తుంటే, ఇంటికొద్దు, గుడికెళ్దామన్నాను.

"నువ్వెందుకొద్దంటున్నావో నాకు తెలుసు. ఇవాళ రోజా వచ్చింది. ఇల్లు నీట్ గా పెట్టే ఉంటుంది. రా " అంటూ తీసుకెళ్ళారు.

ఇంటి లోపలికి వెళ్ళగానే "రుక్మిణీ , టీ తీసుకురా" అని లోపలికి కేకపెట్టారు.

రుక్మిణి లోపల్నుండి బయటకు వచ్చింది. "అమ్మగారూ గేస్ అయిపోయింది. ఫోన్ చేశాను. ఓ అరగంటలో తెస్తానన్నాడు."

రోజా మా ముందే కూర్చుని ఉంది. ఇదివరకులా పని చెయ్యడం లేదు. కిటికీ లోనుండి బయటకు చూస్తుంది. అలా ఖాళీగా కూర్చోవడం ఎప్పుడూ లేదు.

రోజా , బాగున్నావా?" అన్నాను.

నా వంక చూసి కళ్ళెత్తి చూసి నవ్వుకుంటూ తన జడ చివరివరకూ అల్లుకుంటోంది.

రోజా మొహం లో నవ్వు వింతగా ఉంది.

ఇంకా పలకరించాలనిపించింది.

"ఈసారి ఎన్నాళ్ళుంటావు?"

"ఉండను. వెళ్ళిపోతా.."

"ఏం?"

"అక్కడ ఆడుకోవాలిగా నేను."

ఇంతలో గాస్ సిలిండర్ భుజాన వేసుకుని వచ్చాడో అబ్బాయి. బట్టలన్నీ మట్టి గొట్టుకు పోయాయో, మరి అతనేసుకున్నది మట్టి రంగు యూనిఫామో తెలియలేదు.

రోజా కూర్చున్నదల్లా లేచి నుంచుంది. అతని వంక సిగ్గుగా కళ్ళెత్తి చూసి ముసిముసిగా నవ్వుతోంది. పైట పక్కకు వెళ్ళిపోయిన విషయం పట్టించుకోవడం లేదు. అతను గాస్ పుస్తకం లో శారద గారి సంతకం పెట్టించుకుంటుంటే దగ్గరకొచ్చి " ఆడుకుందామా?" అని అడిగింది.

ఆమె వాలకం చూసి అతను కొంచం బెదిరినట్టు చూశాడు.

రోజా లోపలిగదిలోకి వెళ్ళి , కాసేపటికి బయటకు వచ్చింది.

ఇంతలో సంతకం పెట్టించుకుని ఆ అబ్బాయి వెళ్ళిపోయాడు. రోజా మొహం మీద పిండి అద్దినట్లు పౌడర్ గుర్తులు , దానితో పాటే పాండ్స్ పౌడర్ వాసనా ..

గుమ్మందాకా వెళ్ళి బయటకు రెండుమూడు సార్లు చూసింది.

“రుక్మిణీ” శారద గారు పిలిచారు.

“ఏమైంది దీనికి, ఎప్పుడూ లేనిది మనుషులతో మాట్లాడుతోంది.” అడిగారు. .

“పోనీలెండి మనుషుల్లో పడింది. అంతే చాలు. ఎవరితోనూ మాట్టాడదు పెళ్ళెట్టా చెయ్యాలా అని దిగులుపడి సచ్చేదాన్ని రోజూ . దాని జీతం అదీ బాంక్ లో కదిలిచ్చకుండా దాస్తున్నాను . అదిస్తే ఎవరో ఒకళ్ళు దొరక్కపోరు.”

“ఛీ... దానికి పెళ్ళేంటి? నీకేమైనా మతిపోయిందా?” శారద గారు కసురుకున్నారు.

“నేను మాత్రం ఎన్నాళ్ళని ఉంటాను. ఎవడైనా మంచోడు దొరికితే మూడు ముళ్ళు ఏపిద్దామని.”

కాన్ఫరెన్స్ దగ్గరపడుతోంది. శారద గారు సీరియస్ గా, ఆ ఏర్పాట్ల గురించి చెప్తున్నారు.

రోజా వంకే చూస్తున్నాను. నా దగ్గరకొచ్చి, “అబ్బాయెల్లిపోయాడా?” గేస్ అబ్బాయి గురించి కాబోలు నన్నడిగింది.

“ఏయ్ లోపలికెళ్ళు” అంటూ అక్కడే ఉన్న రుక్మిణి విసుక్కుంది.

శారదగారి భర్త వచ్చి మాకు హలో చెప్పి లోపలికెళ్ళారు.

“అయ్యగారికి టీ ఇవ్వు “ అంది తల్లితో. రుక్మిణి ఏదో పనిలోఉండి పట్టించుకోలేదు.

మా దగ్గరకొచ్చి, “అయ్యగారికి టీ !” అంది శారద గారితో..

“మాకు లేని టీ ఆయనకెందుకే?” అని నవ్వారు.

మళ్ళీ వంటింట్లోకి వెళ్ళి తల్లిని “అయ్యగారికి టీ ఇవ్వు” అంటూ గొంతు పెద్దది చేసి అరిచింది.

మేము మాటలాపేసి రోజా వంక చూస్తున్నాం. హాల్లో ఓ మూల కూర్చుని ఏడవడం మొదలెట్టింది.

వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆపమన్న కొద్దీ ఎక్కువవుతోంది కానీ ఆగడం లేదు.

రుక్మిణి టీ తీసుకొచ్చి ఇచ్చిన తర్వాత కానీ ఏడుపాపలేదు.

చీకటి పడుతోందని, నన్ను పంపించడానికి శారదగారు బయటకు వచ్చారు. ఇద్దరం ఆవరణలో ఉన్న వేప చెట్ల చెట్ల కింద నడుస్తున్నాం. లైట్ల వెలుగులో, చెట్లు గాలికి ఊగుతున్నాయి.

శారదగారు ఏం మాట్లాడడం లేదు. ఆవిడ అంత మౌనంగా ఉండడం కొత్తగా ఉంది.

ఓ పావుగంట నడిచాక, దగ్గర్లో ఉన్న ఓ బెంచీ మీద కూర్చున్నాం. "పాపం దానికీ వయసొచ్చింది. తోడుకావాలనిపిస్తోందనుకుంటా.”

నేనేం మాట్లాడలేదు.

“తెలివి ఉండీ, చదువుకున్న అమ్మాయిలే పెళ్ళి తర్వాత, వచ్చిన వాడు ఎలా చూస్తాడో అని భయపడుతున్నారు. రోజాకు పెళ్ళిచేయాలంటే..."

కాసేపాగి. " ఎంతటి ఓపికమంతుణ్ణి తీసుకురావాలి." అంటూ నిట్టూర్చారు.

నేను అక్కణ్ణుంచి వచ్చేసిన తర్వాత, మా వూళ్ళో ప్రాక్టీసు పెట్టుకున్నాను. కొన్నాళ్ళు మా ఇద్దరిమధ్యా ఉత్తరాలు నడిచాయి. ఆ తర్వాత కొన్నాళ్ళపాటు ఆవిడ దగ్గర్నుండి ఏ కబురు లేదు. ప్రాక్టీసు, పిల్లలు, చదువులు ఈ గొడవలో పడి దాదాపు పదేళ్ళు గడిచిపోయాయి. కానీ ఆమెను మర్చిపోయింది ఎప్పుడూ లేదు. ఏదైనా కష్టమైనకేసు వచ్చినపుడు, అలాంటి కేసుల్లో ఏం చెయ్యాలో ఆవిడ మాట్లాడిన మాటలు గుర్తుకొస్తూ ఉండేవి.

ఓ సారి నేషనల్ కాన్ఫరెన్స్ వాళ్ళ సిటీలోనే జరుగుతుందని నోటిఫికేషన్ వచ్చినపుడు దానికి తప్పకుండా వెళ్ళాలని అనుకున్నాను. కాన్ఫరెన్స్ కు వెళ్ళాలన్న ఉత్సాహం లో శారదగారిని కలవొచ్చన్న సంతోషం పాలే ఎక్కువ.

వెళ్ళబోయే ముందు శారదగారికి ఉత్తరం వ్రాశాను. ఫలానా రోజున వస్తున్నాను, కలవడానికి వీలవుతుందా అని. వెళ్ళబోయేవరకూ నాకేం రిప్లై అందలేదు.

దిగులనిపించినా సరే, శారదగారు తప్పకుండా కాన్ఫరెన్సుకు వస్తారు. ఆవిడనెలాగైనా చూడొచ్చని ఆశతోనే వెళ్ళాను.

లంచ్ బ్రేక్ లో అందరి ముఖాలూ జాగ్రత్తగా చూస్తూ ఉంటే ఒక చోట ఈవిడ శారదగారే అనిపించే ఒకావిడ కనిపిస్తే నేను వెళ్ళి ఆవిడ పక్కనే నుంచున్నాను. ఒక పోస్టర్ దగ్గర నుంచుని ఏదో రాసుకుంటూ ఎవరితోనో మాట్లాడుతున్నారు.

పదేళ్ళకే ఇంత వయసు మీద పడుతుందా అన్నట్లున్నారు. గొంతుకూడా విన్న తర్వాత ఇక అనుమానమే లేకుండా పోయింది.

ఆవిడ శారద గారే..

ఆవిడతో మాట్లాడుతున్నావిడ పక్కకెళ్ళగానే, ఆమెను పలకరించి నేనెవరో గుర్తు చేశాను.

కాసేపు నన్ను తేరిపార చూశారు. ఆవిడ మొహంలో సంతోషమూ, ఆశ్చర్యమూ.

అమ్మయ్య ... కాన్ఫరెన్స్ వ్రతానికి ఫలం దక్కింది .

మౌనంగా నన్ను కౌగలించుకున్నారు.

"నేనొస్తున్నానని మీకు లెటర్ వ్రాశాను." నాకు రిప్లై ఇవ్వలేదని నిలదీస్తున్నట్టే అడిగాను.

విడిపడ్డాక, నా చెయ్యి పట్టుకునే నావంక చూస్తూ ఉన్నారు. ఏమ్మాట్లాడకుండా నా చెయ్యి పెదవులకానించుకున్నారు.

ఎలా ఉన్నావు, ఏం చేస్తున్నావు లాంటి వివరాలేం అడక్కుండా..

"ఇప్పుడు నాలుగో హాల్లో చెయిర్ పర్సన్ గా కూర్చోవాలి. సాయంత్రం నాలుగింటి వరకూ ఉండాలి. నాకోసం వెయిట్ చెయ్యి. వెళ్ళిపోకు" అన్నారు.

ఆరోజు ప్రోగ్రాం ముగిసిన తర్వాత నాతోపాటే వచ్చి , నేనుంటున్న హోటల్ రూం ఖాళీ చేయించి , ఇంటికి తీసుకెళ్ళారు.

ఆ ఇల్లు. ఆ ఇంటిని చూడబోతున్నానని చాలా సంతోషంగా వెళ్ళాను కానీ, ఆవిడ తీసుకెళ్ళిన ఇల్లు ఇదివరకు నేను చూసిందికాదు.

చాలా పోష్ లొకాలిటిలో ఒక లక్జరీ విల్లా.

ఆ ఇంటికి వెళ్దామనుకుంటుంటే ఇక్కడకు తీసుకొచ్చారే అని మనసు గునుస్తూ ఉంది.

ఇల్లంతా శుభ్రంగా ఉంది. ఫర్నిచర్ అదీ చాలా చక్కగా పద్ధతిగా సర్ది ఉన్నాయి. ఇంట్లో ఎవరూ లేరు.

ఎక్కడా పుస్తకాలూ, జర్నల్సూ అన్న మాటే లేదు. ఆయనెక్కడా కనిపించలేదు.

ఏమైనా జరగరానిది జరిగిందా? ఏమడగాలో, ఎలా అడగాలో తోచలేదు. "త్వరగా రెడీ అవు. గుడి దగ్గరకు తీసుకెళ్తాను." అని తొందరపెట్టారు. నేను రెడీ అయి వచ్చేసరికి, ఎవరో దోశలు, కాఫీ తెచ్చి ఇచ్చారు. ఆ గేటెడ్ కమ్యూనిటీలో హోటల్ ఉందనీ అక్కణ్ణుంచే అన్నీ వస్తాయనీ చెప్పరావిడ. ఆకలి మీద ఉన్నాను. ఏం మాట్లాడకుండా తినేశాను.

పుస్తకాలు లేకుండా.. మేడం ఎలా ఉంటున్నారు. ఏమీ అర్థం కాలేదు.

ఇంటినుండి బయటకు తీసుకుని వెళ్తుంటే ,

“గుడి అంటే మనం ఇదివరకు వెళ్ళేవాళ్ళం, కోనేరు, రాతి మండపం..అలాంటి గుడేనా ?” అడిగాను.

“అలాంటి గుడి అంటే కష్టం” అంటూ ఆ విల్లా ల మధ్య కట్టిన ఓ పాల రాతి మందిరం లో కూర్చోబెట్టారు.

లోపల మురళి వాయిస్తూ పాలరాతి కృష్ణుడు కనిపించాడు. ఒకళ్ళిద్దరు తప్ప ఎవరూ లేరు ఆ మందిరంలో. కాసేపటికి గుడి తలుపులు మూసి వాళ్ళు కూడా వెళ్ళిపోయారు. మేమిద్దరం మిగిలాము. గుడి ముందు ఆవరణ లో గార్డెన్ లైట్ల వెలుగు కొద్దిగా పడుతోంది తప్ప చీకటిగానే ఉంది.

ఆ ఇల్లు ఏమైంది.

సార్ కనిపించలేదే..?

పుస్తకాలేవీ ఇంట్లో?

మనసులో ప్రశ్నలు బయటికి అడగలేక

“ఇల్లు బాగుంది మేడం , కానీ ఆ ఇంటికి తీసుకెళ్తారనుకున్నాను.”

“ఆ ఇంటినుండి వచ్చేశాను.” ఆ వాక్యం ఎంతో బరువుగా ఉంది.

వచ్చేసెయ్యడమంటే ? ఏమైంది? మరి ఆయన ..

“ఆయనతో విడిపోయాను.”

విడిపోవడమేంటీ...అదీ ఈ వయసులో...

“ఆ ఇల్లు వదిలి వచ్చేశాను. ఆయన్ని వదిలి వచ్చేశాను. రోజా గుర్తుందా, అదే మన రుక్మిణి కూతురు. అక్కడ నర్సింగ్ కాలేజ్ లో పనిచేస్తుండగా, అక్కడ కాలేజి డ్రైవర్ ఆడుకుందామని చెప్పి, దానికో ఆట నేర్పాడు. పాపం దానికేం తెలుసు. సెలవకొచ్చినపుడు ఇక్కడకూడా ఆడుకోవాలనుకునేది. నేర్చుకున్న ఆట ఆడుకోవాలనుకోవడం సహజమే కదా.. మిగతా ఆట ఇక్కడ ఈయన ఆడించాడు .”

“ఆటా?”

“అవును. అవును నాక్కూడా చాలా రోజుల వరకూ తెలియలేదు. రోజాకు కడుపు పెరుగుతుంటే, అనుమానమొచ్చి, ఓ రోజు పరీక్ష చేసి అడిగితే ఇవన్నీ చెప్పింది. ఆ తర్వాత దానికి కూతురు పుట్టింది. నేనే డెలివరీ చేశాను.”

ఆవిడ చెప్పే ప్రతి మాటకూ ఆశ్చర్యపోతున్నాను.

“ ఆ విషయం తెలిసిన రోజున ఎందుకిలా జరిగిందని అడిగితే, ఎన్నో అన్నాడు. నేను అందంగా ఉండనన్నాడు. అందరిలా భర్తను చూసుకోవడం రాదన్నాడు. వండిపెట్టలేదనీ, తనలోని మగవాణ్ణి సంతృప్తి పరచలేకపోయాననీ, ఎన్నో అన్నాడు.. ఎన్నో ఏళ్ళు కలిసి గడిపాము. ఒక్కసారిగా అన్ని నిందలు తట్టుకోవడం ...నా వల్ల కాలేదు. అంతా బాగానే ఉందని నేననుకున్నాను కానీ తన మనసులో అసంతృప్తి పేరుకుంటోందని అనుకోలేదు. తన తప్పుకు నేను కారణమని నిరూపించబోయాడు. ఆ రోజు అవన్నీ విని కూడా నేను ఎలా బతికున్నానా అని ఇప్పటికీ ఆశ్చర్యమే."

"నేనూ నా చదువు, నా పేషంట్లూ ఇవే లోకంగా హాయిగా గడిపాను. ఎవరినో సంతృప్తి పరచాలనీ, అదొక బాధ్యత నామీద ఉందని నేనెన్నడూ అనుకోలేదు. తెలియకుండానే అతను నాకున్నాడనే భరోసా ఏదో ఏర్పడింది. మనతో కలిసి బతుకుతున్న మనిషే మనల్ని ఇంతలా ద్వేషిస్తాడని, మోసం చేస్తాడని అనుకోలేకపోయాను. . నేను చెప్పేది రోజాకు కూతురు పుట్టిన విషయం గురించి కాదు. నామీద

ఇంత ద్వేషం , అసహ్యం ఆయన మనసులో ఉందని నేనేనాడూ అనుకోలేదు.  నిజమే, భార్య అంటే ఎలా ఉండాలో నాకు తెలియదు. అలా నాకు రాదు కూడా."

ఎంత గొప్ప డాక్టర్ ఆమె. ఎంత మంది స్టూడెంట్స్ ఆమెకు అభిమానులుగా ఉండేవాళ్ళు. సబ్జెక్ట్ లో తనకు తెలియని అప్డేట్ ఏదీ ఉండదని ఎంతో గర్వంగా ఉండేవారు.

అలాంటిది అదేదో విషయం నాకు తెలియదని, రాదని ఆవిడ ఒప్పుకోవడం మనసంతా కలచివేసింది.

నా కళ్ళవెంట కారుతున్న నీళ్ళు చీకట్లో కలిసిపోతున్నాయి.  ఆమెకు తెలియకూడదని జాగ్రత్తగా ఊపిరి పీలుస్తున్నాను.

" ఇప్పుడు హాయిగానే ఉన్నాను. భార్య చేసే పనులు అప్పుడు తెలియక చెయ్యలేదు. ఇప్పుడు చెయ్యాల్సిన అవసరం లేదు"

కాసేపు కూర్చున్నాక చీకటి పడుతోందని ఇంటికి తిరిగి వచ్చాము. తలుపులు తెరిచే ఉన్నాయి. వంటింట్లో అలికిడి అవుతోంది.

ఇదేంటి తలుపు తీసి ఉన్నాయంటే"రుక్మిణి వచ్చి ఉంటుంది. తన దగ్గర కూడా తాళం ఉంటుంది."

'రుక్మిణి ఇక్కడే ఉందా ? మరి  రోజా ఎక్కడుంది?

నేను లోపలికి వెళ్ళి బట్టలు మార్చుకుని వచ్చేసరికి

"భోంచేద్దామా?" అంటూ వచ్చారు.

"వద్దండీ. ఆకలి లేదు."

"ఫర్వాలేదు. కొద్దిగా పెరుగన్నం తిను" అంటూ

"రుక్మిణీ!"  అంటూ పిలిచారు.

రెండు జడలు వేసుకున్న పదేళ్ళ అమ్మాయి వచ్చింది. హోం వర్క్ చేసుకుంటుందేమో నోట్ బుక్ తో సహా వచ్చి శారదగారి ముందు నుంచుంది.

"అమ్మని మాకు  భోజనం పెట్టమని చెప్పు. నువ్వు తిన్నావా?"

"ఇప్పుడేగా ట్యూషన్ నుండి వచ్చాము . కాసేపాగి తింటా."

ఆ అమ్మాయి లోపలికి వెళ్ళింది.

"రుక్మిణి అంటే ... ఈ పాపా?"

"అవును. మన  రోజా కూతురు. ."

'రోజా కూతురు ఇక్కడా?' మనసులోనే ఆశ్చర్య పడ్డాను.

"మరి ఆ రుక్మిణి. అదే... రోజా వాళ్ళమ్మ, ఏదీ?"

"రోజా డెలివరీ కాకముందే , స్ట్రోక్ వచ్చి పోయింది."

రెండు నిముషాల తర్వాత , వంటింట్లోనుండి రోజా  వచ్చింది.  మౌనంగా  డైనింగ్ టేబుల్ మీద అన్నీ సర్దుతోంది.

రోజా పని చేస్తుంటే, పైట చెంగు పొడుగ్గా, నేలమీద జారిపోయింది.

దాన్ని  పైకి తీసి , నడుము చుట్టూ జాగ్రత్తగా చుట్టింది రుక్మిణి.

Click here to share your comments on this story